

యథావిధిగా పన్ను చెల్లింపుల కౌంటర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2024-2025 ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో పన్నుల చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు రోజు అయినప్పటికీ శుక్రవారం నగరపాలక సంస్థపరిధిలోని పన్ను చెల్లించేందుకు కౌంటర్లు తెరిచే ఉంటాయని కమిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెజరీ, విఎల్‌పురం ప్రాంతంలోని 23వ నెంబర్ సచివాలయం, ప్రకాష్ నగర్ మీసేవాలో 14వ నెంబర్ సచివాలయం, సీతంపేట మీసేవాలో గల 81వ నెంబర్ సచివాలయం, కోటిపల్లి బస్టాండు మీసేవాలో 36వ నెంబర్ సచివాలయం, నారాయణపురంలో 3వ నెంబర్ సచివాలయం, బొగ్గులదిబ్బలో 42వ నెంబర్ సచివాలయం, బర్మా కాలనీలో 89వ నెంబర్ సచివాలయంలో కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు. చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయం

- జిజిహెచ్‌లో సరైన వైద్యం కరువు
- కానరాని నెఫ్రాలజిస్ట్ నిపుణులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కొన్ని జబ్బులు శరీరకంగానే కాదు మానసికంగానూ మనుషుల్ని కుంగదీస్తాయి. అలాంటి వాటిలో కిడ్నీ వ్యాధి ఒకటి. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన సామాన్యులకు కిడ్నీల సమస్య వస్తే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. రోజురోజుకి పెరుగుతున్న ఈ రోగులు జిల్లా కేంద్రంలో ఉన్న కాకినాడ జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఏనేళ్లుగా సంబంధిత స్పెషలిస్ట్ డాక్టరు లేకపోవడంతో కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి, అనకాపల్లి జిల్లాల నుంచి వివిధ జబ్బులకు వైద్యం నిమిత్తం ప్రతిరోజూ 3 వేల మంది రోగులు ఇక్కడకు వస్తున్నారు. వీరిలో కిడ్నీ రోగులు కూడా అధికంగానే ఉంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వేలకు వేలు సొమ్ము చెల్లించలేని సామాన్యులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వస్తున్నారు. అయితే ఇక్కడ కిడ్నీ వ్యాధికి వైద్యం చేసేందుకు నెఫ్రాలజిస్ట్ లేకపోవడంతో సదరు రోగులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో పలువురికి డయాలసిస్ చేయించుకునే స్థాయి వరకూ రోగం ముదిరిపోతుంది.

సామాన్యులకు వ్యయ, ప్రయాసలు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది కిడ్నీ రోగుల పరిస్థితి. జిజిహెచ్‌లో కేవలం యూరాలజీ, మెడిసిన్ డాక్టర్లు మాత్రమే కిడ్నీ వ్యాధులకు కూడా వైద్యం చేయడం వలన సదరు వైద్యులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీనికితోడు నయం కావాల్సిన జబ్బు మరింతగా పెరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు జిజిహెచ్‌లో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. సరైన సమాచారం ఇచ్చే నాథుడు కరువవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపున ప్రయివేటు ఆసుపత్రులలో చూపించుకున్న పలువురు రోగులకు కిడ్నీ వ్యాధి ముదిరి పోవడంతో ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చేయించుకోవాలిసిందిగా అక్కడి వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం 125 మంది ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అయితే ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ కోసం అనేక మంది వ్యాధిగ్రస్తులు జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి సరైన సమాచారం ఇవ్వడంలో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కాకినాడ జిజిహెచ్‌లో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాధితులు

ప్రత్యేక వైద్యుడు అవసరం

మూత్ర పిండాలు వైఫల్యం చెందడం వలన ఈ వ్యాధి తీవ్రత అంతకంతకు పెరుగుతూ వస్తోంది. రక్తం నుంచి విష పదార్థాలు, వ్యర్థ పదార్థాలను కిడ్నీ తగిన స్థాయిలో వడపోయడంలో విఫలమైనపుడు రోగి పరిస్థితి క్షీణిస్తుంది. రెండు దశల్లో తీవ్రస్థాయి (తీవ్ర మూత్రపిండ గాయం), దీర్ఘస్థాయి (దీర్ఘ మూత్రపిండ వ్యాధి) గా మారుతుంది. ఈ నేపథ్యంలో జిజిహెచ్‌లో సంబంధిత ప్రత్యేక వైద్యుడు ఉంటే రోగ తీవ్రత స్థాయిని తగ్గించే అవకాశం ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు సదరు డాక్టరు పరిశీలించి వైద్యం అందించడం ద్వారా డయాలసిస్ బాధితులు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ప్రయివేటు ఆసుపత్రులలో మినహా జిజిహెచ్‌తో పాటు జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కిడ్నీ స్పెషలిస్ట్ లేకపోవడంతో డయాలసిస్ చేయించుకునే రోగులు అధికమై ప్రభుత్వంపై ఆర్థికంగా భారం కూడా పెరుగుతుంది. అయితే ప్రయివేటు ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ ఇక్కడకు 15 రోజులకొకసారి వచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో అనేకమంది రోగులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ప్రతి రోజూ హెచ్‌ఐవి, హెచ్‌సివి, హెపిటైటిస్‌బి రోగులకు విడివిడిగా 20 నుంచి 30 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని సేవలకు ప్రత్యేక వైద్యులను జిజిహెచ్ రప్పిస్తున్న అధికారులు కిడ్నీ వ్యాధి ప్రత్యేక డాక్టరును కూడా కనీసం వారంలో ఒక రోజైనా ఇక్కడకు రప్పించాలని రోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు కిడ్నీలూ దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఎన్నో వ్యయ, ప్రయాసలు పడుతూ ఇక్కడకు వస్తున్నారు. కోనసీమ, మెట్ట వంటి సుదూర ప్రాంతాల నుంచి రావడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కిడ్నీ రోగుల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని అంతా వేడుకుంటున్నారు.

నాలుగు దశల్లో ఆర్థికసాయం

కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గృహ లబ్ధిదారులకు నాలుగు దశల్లో అదనపు సాయం అందిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల క్షేత్ర స్థాయి, మండల ప్రత్యేక అధికారులతో గృహ నిర్మాణాల అదనపు ఆర్థిక సాయంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పిఎంఎవై గ్రామీణ, పట్టణ 1.0 పథకానికి అదనంగా గ్రాంట్ రూపంలో ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75, పిజిటి గ్రూపులకు రూ.లక్ష చొప్పున సాయం అందిస్తుందన్నారు. తొలి, రెండవ దశల్లో రూ.15 వేలు చొప్పున, మూడు,నాలుగు దశల్లో రూ.10 వేలు చొప్పున నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపు విధానంలో కుల ధ్రువీకరణ తప్పనిసరి అని తెలిపారు. తాజా కుల ధ్రువీకరణ పత్రాన్ని నిర్ధారణ చేసుకుని మాత్రమే లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఇందుకు డిజిటల్ సర్టిఫికెట్‌ను అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ దశలో నిర్మాణాలు చేపట్టే వారి కోసం కొత్త మాడ్యూల్ అనుసరించి డేటా ఎంట్రీ చేయాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, హౌసింగ్ ఎఇ, డిఇ, ఇఇలు నిర్మాణ దశల పురోగతిని అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా గృహ నిర్మాణ అధికారి ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షణ చేస్తారన్నారు. స్టేజ్ కన్వర్షన్‌కు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి మాత్రమే నిర్ధారణ చేయాలన్నారు. ఇండ్ల సందర్శన, కుల ధ్రువీకరణ, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంపై ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గృహనిర్మాణంలో టాయిలెట్స్, సోప్ పిట్స్ నిర్మాణం చేపట్టడం ముఖ్యం అన్నారు. ఫీల్డ్ విజిట్ సందర్భంలో తప్పనిసరిగా ఫోటో క్యాప్చర్ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ ఎ.నాగమల్లేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ బివి.గిరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

మద్యం షాపు వద్దంటూ నిరసన

ప్రజాశక్తి - పెరవలి

మండలం కాపవరం గ్రామం పుంత రోడ్డులో శ్రీ అభయాంజనేయ స్వామి గుడి ఎదురుగా బ్రాందీ షాప్ ఏర్పాటుపై కాపవరం గ్రామస్తులు, మహిళలు గురువారం ధర్నా చేశారు వెంటనే ఇక్కడ మద్యం షాపును తొలగించాలన్నారు. ఈ బ్రాందీ షాపును మరోప్రాంతానికి మార్చాలన్నారు. మందుబాబుల వల్ల రాత్రివేళలో మహిళలు, విద్యార్థినులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు. అనంతరం తహాశీల్దార్ డి.అచ్యుతకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడపనీడి జానకిరాముడు, చింతలపూడి శివశంకర వరప్రసాద్, చింతలపూడి శ్రీను, పిప్పర లీలకృష్ణ, శివ, వంశీ, రాజేంద్ర, మణికంత, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

17న నన్నయలో అంతర్జాతీయ సెమినార్

ప్రజాశక్తి రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్టమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఈ నెల 17న అంతర్జాతీయ సెమినార్‌ను యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని విసి ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూనివర్సిటీలో సెమినార్ బ్రోచర్‌ను ఆమె గురువారం ఆవిష్కరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ 'కంట్రోల్ ఆఫ్ నిట్రోసామినేష్ ఇన్ ఫార్మస్యూటికల్స్ అండ్ అనలిటికల్ టెస్టింగ్' అనే అంశంపై సెమినార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో ప్రధాన వక్తలుగా అమెరికాలోని సైజెన్ ఫార్మాసూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, అమెరికాలోని కెమ్ టెక్స్ లాబొరేటరీస్ సైంటిస్ట్ డాక్టర్ నరేష్ కటారి, మాలేషియా ఐఎన్‌టిఐ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి, ఆంధ్రయూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎస్.పాల్‌డగ్లస్, ఎన్‌ఐటి కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమరేందర్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. సెమినార్ ప్రధాన అంశంపై పరిశోధకులు, అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించవచ్చునని తెలిపారు. రసాయనశాస్త్ర సంబంధిత సబ్జెక్టుకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహన్ రెడ్డి, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.దీప్తి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.రామకృష్ణ, డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, డాక్టర్ సిహెచ్.వెంకటపద్మరావు, పిఎస్‌ఆర్.విద్యాసాగర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ప్రసన్నశ్రీ

ఘనంగా మొల్ల జయంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో గురువారం తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. జెసి ఎస్.చిన్నరాముడు కవయిత్రి మొల్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రామా యణాన్ని మొల్ల రచించారన్నారు. మొల్ల రామాయణం ఆరు కండాలలో 871 పద్యాలతో రచించారన్నారు. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజుల్లో రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి.శశాంక, కలెక్టొరేట్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థుల వనవిహారం

ప్రజాశక్తి- కడియం

తూర్పుగోదావరి జిల్లా పిఎంశ్రీ పాఠశాలల స్కౌట్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ నాలుగో రోజైన శుక్రవారం శిక్షణా తరగతులు సందర్భంగా ఉదయం ఎఎల్‌టి ధనలక్ష్మి ఆధ్వర్యంలో గైడ్ విద్యార్థులు సర్వమత ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం స్థానిక మినర్వా విద్యా సంస్థల సహకారంతో నాలుగు బస్సుల్లో 160 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. అక్కడ మొక్కలను పరిశీలించి, వాటి వివరాలను పుస్తకాల్లో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు మినర్వా స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం క్యాంపు ఇన్‌ఛార్జి గొల్లపల్లి సత్యనారాయణ, స్కౌట్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, గైడ్ ఉపాధ్యాయులు, ఎఎంఒ, సిఎంఒలు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని, సర్దు బాటు ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరం నగరం అన్నపూర్ణమ్మ పేటలోని గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా విద్యుత్ ఛార్జీలుపెరిగిపోయాయని పలువురు బృందం దృష్టికి తీసుకొచ్చారు. పారిశుధ్యం, డ్రెయినేజీలు, రోడ్లు, తాగునీటి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు బి.పూర్ణిమరాజు మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యల్ని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా గత సర్కారు ఇల్లు లేని పేదలు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. కాని నేటికీ వారికి ఇళ్ల స్థలం చూపలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోవట్లేదన్నారు. వెంటనే హామీ పత్రాలు ఇచ్చిన వారికి స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నారన్నారు. కారణంగా ఒక్కోకుటుంబంపై రూ.500 వరకూ అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో కూటమి నాయకలు తెలిపారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి సర్కారు అవలంబించిన విధానాలనే ఈ ప్రభుత్వమూ అమలు చేస్తుందన్నారు. ప్రజలపై భారాలు వేయడంలో రెండు ప్రభుత్వాలు ఒకే పద్ధతిని అవలంబిస్తున్నాయన్నారు. తక్షణమే ఈ భారాలను ఉపసంహరించుకోవాలన్నారు. నగరంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పూడికతీతకు నోచుకోలేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. వెంటనే ఈ సమస్యలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, జిల్లా కమిటీ నాయకులు కెఎస్‌వి.రామచంద్ర రావు, ఐ.సుబ్రహ్మణ్యం, డివైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పూర్ణిమరాజు

ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచితంగా డిఎస్‌సి కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎంఎస్.శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 15తో గడువు ముగుస్తుందన్నారు. https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్లో డిఎస్‌సి ఉచిత కోచింగ్ కోసం షార్ట్ లిస్ట్ చేసిన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు జాబితా, వెబ్ ఆప్షన్స్ ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ ఆప్షన్ కోసం మార్చి 15వరకూ మ్యాతరమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

గురుకుల ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని ఎపిఆర్ భూపతిపాలెం ఎంట్రన్స్ టెస్ట్ లోగో, పోస్టర్‌ను గోకవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పైడిమళ్ల లక్ష్మణరావు, ప్రగడ ప్రసాద్ ఆధ్వర్యంలో గోకవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ యు.రామన్నదొర గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రామన్న దొర మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులు వారి పిల్లలకు ఇది చక్కటి అవకాశం అన్నారు. ఈ పాఠశాలకు వెళ్లాలంటే జిల్లా స్థాయిలో ఎంట్రన్స్ టెస్ట్‌లో పాస్ కావాల్సి ఉంటుందన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాను కూడా సీలేరు ఎపిఆర్ స్కూల్లో చదివానని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్.నారాయణ, సిసి ఎస్‌డెలిగేట్ దాలే అప్పాజీ, ఎంఎన్.రావు, బెబీరావు, శంకర్, పుత్రయ్య, పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తునన మేనేజర్ రామన్నదొర

జాతీయ సదస్సులో 'ఆర్ట్స్' విద్యార్థుల హవా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎఎస్‌ఆర్ జిల్లా రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒక రోజు జాతీయ సదస్సులో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చారు. ఎం.తోష "సింధూ నాగరికత పరిపాలనలో మతం పాత్ర"పై పరిశోధన పత్రంపై వివరణ ఇచ్చి ఆకట్టుకుంది. సిహెచ్.అఖిల, స.నూర్జాహాన్, జే.రమేష్, కే.వాణి, జెవై.సూర్యచంద్ర, కె.సంధ్య, ఎన్.లావణ్య, వి. ప్రవల్లిక భారత పరిపాలనాచరిత్రలోని వివిధ అంశాలపై పోస్టర్ ప్రజెంటేషన్ ఇచ్చి మన్ననలు అందుకున్నారు. సయ్యద్ నూర్జహాన్‌కు ప్రథమ స్థానం, నగదు బహుమతి లభించాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ బాబ్జి, డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, కెపిబిఎల్.సరోజ, రామారావు, రామకృష్ణ, తులసికుమారి పరిశోధనా పత్రాలను సమర్పించారు. 25 మంది విద్యార్థులతో జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించిన ప్రిన్సిపల్ రామచంద్రకు అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.



జాతీయసదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంప ఎర్రంపాలెం హై స్కూల్లో గ్లోబల్ అలూమినీ వెల్ఫేర్ ట్రస్ట్ స్కూల్ మేట్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులతో పాసై ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతి ఏడాది మెరిట్ విద్యార్థులకు ఆగస్టు 15న నగదు పురస్కారం కూడా అందిస్తున్నామన్నారు. 2024లో రంప ఎర్రంపాలెం హై స్కూల్ కాకుండా చుట్టుపక్కల ఉన్న 14 స్కూల్‌కి నవంబర్ 14ను బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సభ్యులు పాటి రాజా, ట్రస్ట్ అధ్యక్షులు కాకర విష్ణు, పప్పు రాఘవులు, జాజుల అవతారం, ఉంగరాల రాంబాబు, తిరపతి బాబి, వెంకటరమణ, హెచ్‌ఎం ప్రమీలరాణి పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న పెందుర్తి


ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామిని ముఖ్యమంత్రి పర్యటన కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ గురవారం దర్శించుకున్నారు. కేబినెట్ హోదాలో ఆయన మొదటి సారి దర్శనానికి వచ్చారు. ఆలయ ధర్మకర్త పరాశర రంగరాజభట్టర్, ఆలయ అర్చకులు పెద్దింటి చంటిబాబు, పెదపాటి గిరిధర్ తదితరులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి వెంకటేష్ ను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయాన్ని టిటిడిలో అనుసంధానం చేయడానికి స్థానిక ఎంఎల్‌ఎతో కలిసి పనిచేస్తానన్నారు. టిడిపి ఇన్‌ఛార్జిగా కొత్తవారిని నియమించాల్సిన అవసరం లేదని, నియోజకవర్గంలో బొడ్డు వెంకటరమణ చౌదరికి రుడా చైర్మన్ పదవి వచ్చినా ఆయనే రాజానగరం ఇన్‌ఛార్జిగా కొనసాగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి అభిరామ్, రొంగల శ్రీనివాస్, తెలగంశెట్టి శ్రీను, పరస శ్రీను, కటకం చలం, సుంకర శ్రీను, కోర్పు బుజ్జి, కట్టా సత్తిబాబు, కొయ్యా సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

కార్టూన్ 'నిజం'



గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులు సూచించారు. గురువారం జిల్లాలో పలుచోట్ల ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాలు జరిగాయి.

ఉండ్రాజవరం : సుస్థిర గ్రామ అభివద్దే ధ్యేయంగా పని చేయాలని ఎంపిడిఒ వివివిఎస్.రామారావు మండలంలోని ప్రజా ప్రతినిధులకు సూచించారు. గురువారం ఆయన అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, గ్రామ, మండల స్థాయి అధికారులు ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రణాళిక ఉద్యమం 2025-26 గ్రామపంచాయతీ వార్షిక ప్రణాళికలు తయారీ, మార్గదర్శకాలు వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, జడ్‌పిటిసి, ఇఇఒపిఆర్‌డి కె.ఆంజనేయశర్మ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు : చాగల్లు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులకు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో ఒక రోజు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి కోసం జిపిడిపి థీమ్స్‌ను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆర్.శ్రవణ్‌కుమార్, ఎంపిపి మట్టా వీరాస్వామి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధిపై గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి 2025-26కు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ టిబివి.రమణ ప్రజాప్రతినిధులకు సూచించారు. తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఎంపిటిసికు గురువారం ఒకరోజు శిక్షణ జరిగింది. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.



ఉండ్రాజవరంలో నిర్వహించిన శిక్షణలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పెరవలి : ఎంపిడిఒ సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ డెవలప్‌మెంట్ ప్లాన్, నిధుల వినియోగం, చెత్త సేకరణ, సుస్థిర అభివృద్ధి నిధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎపిఎం బండారు రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి : గురువారం ఎంపిపి కెవికె.దుర్గారావు అధ్యక్షతన ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇనర్వహించారు. వివిధ ప్రణాళికలు వాటిని అమలు విధానాలను వివరించారు. వైస్ ఎంపిపి సాదే సుబ్బారావు, ఇఒపిఆర్‌డి రాజారావు, ఎంపిడిఒ సూపరింటెండెంట్ జి.శాంతి పాల్గొన్నారు.

గోపాలపురం :గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిషత్ సమావేశం హాలులో మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎంపీటీసీలు, సర్పంచులకు, గ్రామ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జనసేన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గోకవరం

పిఠాపురంలో శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ గోకవరం టౌన్ యూత్ అధ్యక్షుడు దోసపాటి సుబ్బారావు పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి హాజరవుతున్న మొట్టమొదటి పార్టీ ఆవిర్భావ సభ నేపథ్యంలో ప్రతి ఒక్క జన సైనికుడు సభకు హాజరవ్వాలన్నారు. పాల్గొనేవారు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు.

9 మంది విద్యార్థుల గైర్హాజరు

తాళ్లపూడి : గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని ఎగ్జామ్ చీఫ్ గౌరీనాథ్ తెలిపారు. వేగేశ్వపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 245 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 236 మంది హాజరయ్యారని చీఫ్ తెలిపారు.

నేరాలు ఘోరాలు


ప్రమాద ఘటనా ప్రాంతం

రోడ్డు ప్రమాదంలో నానమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

మండలంలోని దుద్దుకురు ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలపురం గ్రామానికి చెందిన నానమ్మ, మనవడు షేక్ మీరా తున్నీషా(65), షేక్ సమీర్(17) మృతి చెందారు. దేవరపల్లి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ మీర తున్నీసా సమీవుల్లా భార్యాభర్తలు. వీరి కుమార్తె అనారోగ్యంతో ఇటీవల మరణించింది. ఈ నేపథ్యంలో కీడు బట్టలు పెట్టేందుకు మీర తున్నీసాను గోవర్ధగిరిమెట్టలో ఉంటున్న సోదరుడు ఆహ్వానించాడు. దీంతో మీర తున్నీసా తన మనవడు షేక్ సమీర్‌ని తీసుకుని బైకుపై పంగిడి వద్ద ఉన్న గోవర్ధనగిరి మెట్టలోని తమ్ముడి ఇంటికి వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని తిరిగి గోపాలపురం పయనమయ్యారు. దుద్దుకూరు వద్దకు వచ్చేసరికి లారీని వెనకవైపు బలంగా వీరి బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో రాజమండ్రి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. దీంతో గోపాలపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమీరం స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఇసి ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. శనివారం ఒక పరీక్ష రాస్తే ఇంటర్మీడియట్ పూర్తవుతుందనకున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసకుంది. సమీర్ తండ్రి రియాజ్ వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెలవు రోజుల్లో సమీర్ తండ్రికి చేదుడు వాదోడుగా ఉంటున్నాడు. గురువారం పరీక్షకు సెలవు కావడంతో తన నానమ్మను తీసుకుని వెళ్తుంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఆక్సిజన్ అందక శిశువు మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆక్సిజన్ అందక మూడురోజుల నవజాత శిశువు గురువారం మృతి చెందింది. దీనిపై ఆసుపత్రి వద్ద శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు అందోళన చేశారు. వివరాలు ఇవి. .రావులపాలెం కొత్త కాలనీకి చెందిన మార్గాని వీరబాబు, భార్య కనకమహాలక్ష్మి దంపతులకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండవకాన్పులో మగబిడ్డ జన్మించింది. శిశువు కు గురక వస్తుందని కొత్తపేట శివారు పోస్ట్ ఆఫీస్ సమీపంలోని ఒక ప్రయివేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాలంటూ వైద్యులు సూచించారు. ఈమేరకు మంగళవారం చేర్పించినట్లు సమాచారం. చికిత్స అనంతరం గురువారం పంపిస్తామని చెప్పిన ఆసుపత్రి సిబ్బంది తండ్రి వీరబాబుకు ఫోన్ చేసి శిశువుకు సీరియస్‌గా ఉందని రాజమహేంద్రవరంలోని చిన్నపిల్లల ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిసింది. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రి వైద్యులు శిశువును పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించినట్లు శిశవు బంధువులు తెలిపారు. బుధవారం రాత్రి శిశువుకు సిబ్బంది ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం వహించారని శిశువు తల్లిదడులు, బంధువులు ఆరోపించారు. దీంతో గురువారం చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని తండ్రి, వైద్యులను వివరాలు తెలుసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ ఆసుపత్రిలో వైద్యం సరిగా అందక గతంలో కూడా కొంతమంది శిశువులు చనిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో గురువారం వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన అరుగుల చంద్రరావు(83) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం మండలంలోని ర్యాలి గ్రామంలో బంధువుల ఇంటి లో జరుగుచున్న కార్యక్రమానికి లక్ష్మీ పోలవరం నుంచి నడుచుకుంటూ ర్యాలి గ్రామం వస్తున్నాడు. ఈ సమయంలో జిమ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి కృషి ట్రాక్టర్ అతి వేగంతో చంద్రరావును వెనుక వైపు నుండి ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు మీద పడి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రరావు మనవడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని నర్సిపూడిలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. నాటు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నర్సిపూడికి చెందిన గుత్తుల సుబ్బారావు 20 లీటర్లు నాటు సారాతో పట్టుబడ్డాడన్నారు. అతనిని నుంచి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి ఆలమూరు కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడు సుబ్బారావుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం కోసం వేధింపులపై వివాహిత సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన సిహెచ్.మోహన రావు కుమారుడు వెంకటేష్‌తో రఘుదేవపురం గ్రామానికి చెందిన సృజనకు 2021లో వివాహం అయ్యింది. కొంత కాలం వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల కొన్ని నెలలుగా భర్త వెంకటేష్, అత్త సదాలక్ష్మి, ఆడపడుచు దుర్గా ఆమె భర్త పాలిశెట్టి రఘుబాబు అదనప కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నారు వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

దిగుబడీ లేదు... ధరా లేదు...

నిండా మునిగిన దుంప రైతు ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -గోకవరం

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ధరలేక రైతులు అప్పుల్లో నిండా మునిగిపోతున్నారు. ప్రతి ఏడాది దుంప రైతులకు నష్టాలు తప్పడం లేదు. దీంతో ఏమి చేయాలో అర్థం కాక సాగో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకొని మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.


కళ్లాంలో సాగోదుంప రాశులు

ఏజెన్సీ ముఖ ద్వారమైన గోకవరం మండలం, అలాగే మండలాన్ని ఆనుకొని ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో 30 వేల ఎకరాల్లో సాగో దుంపను రైతులు సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో దుంప దిగుబడి తగ్గిపోయింది. పంట సాగుకు ఎకరాకు కౌలు, పెట్టుబడులు కలిపి సుమారు రూ.45 వేల నుంచి 50 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరాకు 50 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 20 నుంచి 25 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. సగానికిపైగా దిగుబడి తగ్గిపోవడంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. ఈ ఏడాది మద్దతు ధర 70 కేజీల బస్తాకు రూ.1100 నుండి రూ.1,200 నిర్ణయించారు. దీని వల్ల ఎకరాకు రూ.30వేలు కూడా రాని పరిస్థితి. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వచ్చిన డబ్బులు వడ్డీలకు కూడా చాలవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.15వేలకు పైగా నష్టం వాటిల్లుతుందని, మద్దతు ధర కనీసం రూ.2వేల నుంచి రూ.2,500రూ వరకు పెంచితే పంటకు పెట్టిన పెట్టుబడి అయిన వస్తాయని రైతులు అంటున్నారు.

దళారుల దోపిడీ

సాగో దుంపను ఎక్కువగా కేరళ, తమిళనాడు, చెన్నై తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. దళారుల ప్రవేశంతో రైతులకు మద్దతు ధర లభించట్లేదు. దళారులంతా ఏకమై గిట్టుబాటు ధర లేకుండా దోచేస్తున్నారు. దుంప రేటును తగ్గించి కొనుగోలు


సాగోదుంప చేను

చేస్తున్నారు. గతంలో రాజమహేంద్రవరం, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి నేరుగా రైతుల నుంచి దుంపను కొనుగోలు చేసేవారు. అప్పట్లో గిట్టుబాటు ధర రూ.2,500 నుంచి రూ.2,800 వరకూ చెల్లించే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కమీషన్ దారులు అందరూ కుమ్మక్కయి ధరను తగ్గించేసి రైతులను దోచుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. బస్తాకు రూ.1200 మించి ఇవ్వట్లేదని వాపోతున్నారు.

పెట్టుబడి పెరిగింది... దిగుబడి తగ్గింది

ఈ ఏడాది దుంప దిగుబడి సగానికి పడిపోయింది. ధర కూడా లేదు. దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఎకరాకు కౌలుతో కలిపి సుమారు రూ.50వేల వరకూ ఖర్చు చేశాం. ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావట్లేదు. ఇదే మా జీవనాధారం. మానేద్దాం అంటే వేరే పంట లేదు. దుంప తోటలు వేసి నష్టాల్లో కూరుకు పోతున్నాం.

- లంక వాసు, కౌలు రైతు, మల్లవరం

వర్షాలు లేక దిగుబడి తగ్గింది

ముందు వర్షాలు కురవడంతో దుంప తోటలు కుళ్లిపోయాయి, తరువాత వర్షాలు కురవక పోవడంతో దుంప పెరగలేదు. దీనివల్ల దిగుబడి తక్కువగా వస్తుంది. పెట్టుబడులు ఎక్కువ, కౌలు ఎక్కువ కావడంతో దిగుబడి లేక అప్పుల్లో కూరుకుపోతున్నాం. దుంప రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గుండి హరి, కౌలు రైతు, మల్లవరం

దళారుల వల్లే నష్టాలు

గతంలో ఇతర మండలాలు, జిల్లాల, రాష్ట్రాల నుంచి వ్యాపారులు నేరుగా వచ్చి పంటను రైతు వద్ద కొనుగోలు చేసేవారు. అప్పటిలో 70 కేజీలు బస్తా కనీసంగా రూ.2,500 గరిష్టంగా రూ.3వేల వరకూ పలికేంది. రైతు సంతోషంగా పంటను నమ్ముకుని బతికేవారు. ప్రస్తుతం వారిని రానివ్వకుండా దళారులే రాజ్యమేలుతున్నారు. వారే ధర నిర్ణయిస్తున్నారు. ఫలితంగా రైతులు నష్టాలబారిన పడుతున్నాం. దళారీ వ్యవస్థను అరికట్టాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మేడిశెట్టి రమణ, కౌలు రైతు, మల్లవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

చివటంలో 11కెవి ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ పనులు నిమిత్తం, పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని పాలంగి, చివటం గ్రామాల గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపేస్తామన్నారు. వ్యవసాయ 3 ఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల అందిస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు నిధులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

వివిధ వర్గాలకు చెందిన లబ్ధిదారుల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనపు నిధులను అందిస్తుందని గృహ నిర్మాణ శాఖ ఎఇ శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన గృహాలను ఆర్థిక స్థోమత ఇతర కారణాల వలన పూర్తి చేయకుండా ఉండిపోయిన వారికి రూ.50వేల చొప్పున సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో ఎస్‌సి, బిసిలకు చెందిన 192 మంది లబ్ధిదారులు ఉన్నారనానరు.

అంగన్‌వాడీల హామీలను నెరవేర్చని ప్రభుత్వం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్ బాబు విమర్శించారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ గోడు వినిపించాల నుకున్న అంగన్ వాడీలను ఎక్కడి కక్కడ నిర్బంధించడం ప్రభుత్వ నిరంకు శత్వానికి నిదర్శన మని సురేష్‌బాబు మండిపడ్డారు. అంగన్‌వాడీల గొంతు నొక్కి ఆందో ళనలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయ బద్ధమైనవని వెంటనే వారిని పిలిచి ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలని, తక్ష ణం గ్రాట్యుటీ చెల్లిం పు హామీని అమలు చేయాలని, మినీ అంగన్ వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణిం చాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శ కాలు ఇవ్వాలని, పెండింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విధి నిర్వహణలో అంగన్ వాడీలు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఇతర 12 డిమాండ్లపై ప్రభుత్వం సాను కూలంగా స్పందించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కళాశాలకు స్థలం కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి -ముమ్మిడివరం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన స్థలం కేటాయిస్తూ జిఒ.తీసుకురావడం హర్షణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి అవసరమైన 3.20 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తూ జిఒ నెం.84 తీసుకురావడంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు గత రెండు సంవత్సలుగా చేసిన కృషిని ఆయన కొనియాడారు. గురువారం ఎం ఎల్ఎ క్యాంప్ కార్యా లయంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎం ఎల్ఎ దాట్ల సుబ్బ రాజును కలిసి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


చిత్రాడలో స్వాగత ద్వారం

నేడు జనసేన జయకేతనం సభ

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం జనసేన పార్టీ 14వ ఆవిర్భావ 'జయకేతనం' సభ నేడు చిత్రాడ గ్రామంలోని ఎస్‌బి వెంచర్‌లో జరగనుంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఈ సభను భారీ స్థాయిలో జరిపేలా ఏర్పాట్లు చేశారు. వివిధ నిర్వహణ కమిటీలను వేసి బాధ్యతలు అప్పగించారు. సభ ప్రాంగణం డెకరేషన్, వేదిక ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే వారికి కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీరు, మజ్జిగ, ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 7 వైద్య శిబిరాలు, 14 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. జయకేతనం సభకు పార్టీ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతోపాటు, రాష్ట్ర నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి సైతం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రానుండటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు1600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 75 సిసి కెమెరాలు, రోడ్డుకు ఇరువైపులా, సభ ప్రాంగణంలో ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల ఉపన్యాసాలు ఉంటాయి. సాయంత్రం జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు. కాకినాడ - కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ ట్రాఫిక్‌ని మళ్లించారు. సభకు వచ్చే వారికి ఎక్కడికక్కడ మంచినీరు, మజ్జిగ వంటివి అందించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేశారు.

సౌర విద్యుత్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

సౌరవిద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,లలో అగ్రశ్రేణి సోలార్ కంపెనీగా రాణిస్తూ, దేశంలో సోలార్ పరిశ్రమలలో రెండవ కంపెనీగా ఉన్న ఫ్రేయర్ ఎనర్జీ తమ తాజా రూఫ్‌టాప్ సోలార్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను రాజమండ్రి నెలకొల్పింది. దీన్ని ఎంఎల్‌ఎ గోరంట్ల గురువారం ప్రారంభించారు.ఫ్రేయర్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ మార్డా, డైరెక్టర్ రాధిక చౌదరి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు సౌరభ్ మార్డా మాట్లాడుతూ 'సౌర వ్యవస్థలో పెట్టుబడి పెడితే 25 నుంచి 30 సంవత్సరాల వరకు ప్రయోజనం పొందొచ్చన్నారు. డైరెక్టర్ రాధిక చౌదరి మాట్లాడుతూ 11ఏళ్లుగా తమ సంస్థ పనిచేస్తోందన్నారు. పాడేరు తదితర గ్రామీణ ప్రాంతాల్లో సౌర ప్రాజెక్టులు విజవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్‌కి రూ.60 నుంచి రూ.70వేలు ఖర్చు అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. మెగావాట్లు పెరిగే కొద్దీ ప్రయోజనం ఎక్కువ ఉంటుందన్నారు. సౌర విద్యుత్ అమర్చుకోడానికి పదేళ్ల కాలపరిమితికి బ్యాంకు రుణాలు కూడా వస్తాయన్నారు.

ఎస్.లింగారెడ్డికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డికి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం నుంచి పిహెచ్‌డిని విసి ఎస్.ప్రసన్నశ్రీ గురువారం ప్రదానం చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన జిల్లాల్లోని హ్యూమన్ రిసోర్స్ అనలిటిక్స్ అండ్ టీచర్స్ పెర్ఫార్మెన్స్ విత్ రెస్పెక్ట్ టూ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' అనే అంశంపనై ఆయన పరిశోధక వ్యాసానికి పిహెచ్‌డి లభించిందన్నారు. గైడ్‌గా డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, కో గైడ్‌గా సీతానగరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.చిట్టిబాబు వ్యవహరించారని తెలిపారు. ఉన్నత విద్యకు ఉపయోగకరమైన చక్కని పరిశోధనను పూర్తి చేసిన డాక్టర్ ఎస్.లింగారెడ్డిని విసి అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది లింగారెడ్డికి అభినందనలు తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలోని పరీక్షా కేంద్రాలను ఎంఇఒ-2 డి.శారదాజ్యోత్స్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు మినహా ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోరన్నారు. ఉదయం 9:30కు ప్రారంభమయ్యే పరీక్షకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలన్నారు. మండలంలోని 15 గ్రామాల నుంచి 910 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. 46 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. ఉంగ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేలివెన్ను శశి, శ్రీమతి అన్నపూర్ణా పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా కేంద్రాలు బెంచీలు,ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి ఇతర సౌకర్యాలను పరిశీలించామని తెలిపారు.

భవిత విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం భవిత స్కూల్లో విద్యార్థులకు వాటర్ బాటిల్స్, స్టీల్ గ్లాసులను రిపోర్టర్ బత్తుల వీరభద్రరావు, అనిత దంపతులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయిని ఎస్తేరురాణి మాట్లాడుతూ వీరభద్రరావు, అనిత దంపతుల రెండవ కుమార్తె తనిష్క పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేశారన్నారు.